ప్రజాశక్తి

ఆదివారం 28 జనవరి 2024

5

పార్వతీపురం మన్యం

ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన

నేడు గిరిజనుల సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురంలోని గిరిజన భవనంలో ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన ఆదివారం గిరిజనుల సమావేశం నిర్వహిస్తున్నట్లు గిరిజన ఉద్యోగ సంఘాల సభ్యులు పువ్వల అప్పన్నదొర తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో గిరిజనులకు ముప్పు పొంచి ఉందని, వీటిపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు నిమ్మక జయరాజు, కోలక లక్ష్మణమూర్తి, నాయకలు ఆరిక నీలకంఠం, కొండగొర్రి ధర్మారావు, తదితరులు హాజరవుతారని, గిరిజనులంతా పాల్గొనాలని కోరారు.

సమరోత్సాహం

బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

- కేడర్‌ను ఉత్సాహ పరిచిన జగన్
- ప్రజలే నా ధైర్యం... సంక్షేమమే విధానం..
- పార్టీని భుజాన వేసుకున్న వారికి ఎప్పుడూ ప్రాధాన్యం
- సంగివలస 'సిద్ధం' సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి
- తరలివెళ్లిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'75ఏళ్ల వయసు మళ్లిన చంద్రబాబు మాదిరిగా నేను పొత్తుల కోసం దత్తపుత్రుడు, ఇతరుల వెంట వెంపర్లాడను. ప్రజలే నా ధైర్యం.. సంక్షేమం, అభివృద్ధి పథకాలే నా విధానం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. భీమిలిలో సంగివలస వద్ద శనివారం వైసిపి ఏర్పాటు చేసిన 'సిద్ధం' బహిరంగ సభకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విజయనగరం జిల్లా నుంచి వందలాది వాహనాలు, బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సభలో కేడర్‌కు జగన్ 2024 ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ విపక్షాలపై విరుచుకుపడుతూ పార్టీ కేడర్‌లో ఎన్నికల సమరోత్సాహాన్ని నింపారు. వేల సంఖ్యలో పార్టీ కేడర్ తరలిరావడంతో భీమిలిలో ఇవాళ తనకు అటు సముద్రం, ఇటు జనసముద్రం కనిపిస్తుందని వ్యాఖ్యానించారు. సభకు వచ్చిన ప్రతి ఒక్కరిలోనూ ఒక్కో సేనాధిపతి కనిపిస్తున్నారని, ఇటు పక్క పాండవ సైన్యం ఉంటే అటుపక్క కౌరవ సైన్యం ఉందని ఈ యుద్ధంలో చంద్రబాబు సహా ప్రతి ఒక్కరూ ఓడిపోక తప్పదంటూ వ్యాఖ్యానించారు. పద్మవ్యూహంలో చిక్కుకోడానికి తాను అభిమన్యుడ్ని కాదని అర్జునుడినని చెప్పారు. ఈ అర్జునుడికి శ్రీకృష్ణుడిలా ప్రజలు తోడున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి 175కి 175 అసెంబ్లీ సీట్లు రావడం ఖాయమన్నారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీచేసే ధైర్యం ఏనాడూ లేదని, ఈ సారి తన దత్తపుత్రుడ్ని తోడుతెచ్చుకున్నారని, 2019 ఎన్నికల్లో వచ్చిన 23 సీట్లు కూడా వారికి రావని అన్నారు. చంద్రబాబు చెప్పుకోడానికి ఏమీలేదని, తాను చెప్పడానికి 4ఏళ్లలో రూ.లక్షల కోట్లు ప్రజలకు బటన్ నొక్కి అకౌంట్లలో సంక్షేమం అందించామన్నారు. 2019 వరకూ ప్రజల అకౌంట్లలో ఏమీ పడలేదని, తాను అధికారంలోకి వచ్చాక ఈ పెద్ద మార్పు జరిగిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక లాభ, నష్టాల లెక్కను చూడకుండా సంక్షేమం ఇచ్చానన్నారు. పాలనలో జగన్ మార్క్ ఉందని, బాబు పాలన చెప్పుకోడానికి ఏమీలేదని అన్నారు. అప్పట్లో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 650 హామీల్లో 10శాతం కూడా అమలుచేయకుండా అన్నిటినీ అటకెక్కించేశాడని విమర్శించారు. హామీలు అటకెక్కించిన బాబు ఇంకా బతికే ఉన్నాడని ప్రజలకు వివరించాల్సిందిగా కేడర్‌కు జగన్ దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సిపి జగన్‌ది కాదని కేడర్‌దని వారిలో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. వాలంటీర్లు మనలోంచి వచ్చిన మనవాళ్లేనని బయటవారు కాదని అన్నారు. 2019 నుంచి 99శాతం హామీలను అమలు చేశామన్నారు.

వచ్చే 70 రోజులూ నిత్యం యుద్ధమే..

వచ్చే 70 రోజులూ నిత్యం యుద్ధమేనని, మీరంతా సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రతిపక్షాలపై యుద్ధ బాణాలుగా మారాలి' అని ఎన్నికల నగారా మోగించారు. టిడిపి, జనసేన కలసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచార ఆయుధాలతో దాడికి వస్తున్నారని, ఒంటరిగా ఎదుర్కొనడానికి తాను సిద్ధమని, మీరూ సిద్ధమేనా.. అలా అయితే దిక్కులు పిక్కటిల్లేలాగ సమరనాదం చేయండి అంటూ జగన్ అన్నారు. ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ తన పాలనలో సంక్షేమం అందిందని, 60 శాతం ప్రజలు తమతోనే ఉన్నారని, ప్రతి ఇంటి నుంచీ ఒక స్టార్ క్యాంపెయినర్ వైసిపి కోసం వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎన్నికలకు నేను సిద్ధం..మీరు సిద్ధమా అంటూ పదేపదే హాజరైన వారితో చప్పట్లు కొట్టించారు. ఉత్తకుండకు అరుపులెక్కువ.. చేతగానివాళ్లకు మాటలెక్కువ అనేలా ప్రతిపక్షాలున్నాయన్నారు. రాగల ఎన్నికలు పేదరికం నుంచి ప్రజలను బయటకు తెచ్చేవని, చదువుకునే పిల్లల తలరాతలు మార్చేవని అన్నారు.

వేదికపై రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పీడిక రాజన్నదొర, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, సీదిరి అప్పలరాజు, వైసిపి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఉత్తరాంధ్రకు చెందిన అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు, ముఖ్యమైన ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పౌష్టికాహారంతో

సంపూర్ణ ఆరోగ్యం

పోషణ కిట్లు గర్భిణులే తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-మక్కువ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. ఫ్రీజం కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యేకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ బాగుజోల గ్రామంలో కలెక్టర్ శనివారం పర్యటించారు. పదేళ్లలోపు చిన్నారుల్లో మరణాల రేటు నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. బాగుజోల గ్రామంలో ఇంటింటిని సందర్శించి గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడి మాతా, శిశు మరణాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించాలని గిరిజనులకు సూచించారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలను పరిశీలించారు. వారిలో వచ్చిన మార్పును గమనించారు. గర్భం దాల్చిన వెంటనే పేర్లను ఆసుపత్రిలో నమోదు చేయాలని ఆయన సూచించారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం వైఎస్ఆర్ పోషణ కింద పౌష్టికాహార కిట్లు అందిస్తుందని, వాటిని గర్భిణులు మాత్రమే తీసుకోవాలని సూచించారు. గర్భిణుల్లో రక్తహీనత సమస్య నివారించుటకు సచివాలయ స్థాయిలో అంగన్వాడీ, ఎఎన్ఎం, మహిళా పోలీస్‌ను బృందంగా నియమించామని, వీటిని ఎంపిడిఒ పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ బందం రక్తహీనత ఉన్న వారిని గుర్తించి క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయడం, పౌష్టికాహారం తీసుకునే విధంగా చర్యలు చేపట్టడం చేస్తుందన్నారు. ఈ చర్యలు వలన మాత, శిశు మరణాలు గణనీయంగా తగ్గించగలిగామని, ప్రజలు మరింత సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, వైద్యాధికారి రఘుకుమార్, కిరణ్ కుమార్, తహశీల్దార్ సూర్యనారాయణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కిచ్చాడలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో కిచ్చాడ పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఏనుగుల గుంపు సంచరించింది. సమీప చెరకు, అరటి తోటల్లో తిరుగుతూ పంటలను నాశనం చేసింది. దీంతో సమీప గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన గ్రామంలోకి ప్రవేశిస్తాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తమ ప్రాంతం నుంచి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించి, పంటలను, తమ ప్రాణాలను కాపాడాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

నియోజకవర్గ పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శనివారం సీతంపేట మండలంలోని హడ్డుబంగి, ఉప్పరజమ్మి, శంభం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పిఒ మాట్లాడుతూ మరుగుదొడ్లు లేని పోలింగ్ కేంద్రాల్లో వెంటనే నిర్మించాలన్నారు. పనులు జరుగుతున్న కేంద్రాల్లో వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్తు సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నర్సింహమూర్తి, ఆర్ఐ వెంకటేష్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

తులసమ్మా... ఆస్పత్రికి తీసుకెళ్తా రామ్మా!

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని దేవరశిర్లాం పరిధిలోని మెట్టలోవరకండి గ్రామానికి చెందిన తులసమ్మ అనే గర్భిణికి 9 నెలలు పూర్తికావస్తున్నాయి. ఈ సమయంలో ఇంటి వద్ద ప్రసవం మంచిది కాదని, ఆస్పత్రికి వెళ్దామని ఎఎన్ఎం మంగ ఆమెను బతిమలాడసాగింది. ఆ మహిళకు ఉండే అనారోగ్య కారణాల వల్ల విజయనగరం జిల్లా కేంద్రంలోని ఘోషా ఆస్పత్రిలో మాత్రమే ప్రస్తుతం ప్రసవం చేయించాల్సి ఉంటుందని ఆ కుటుంబానికి ఎఎన్ఎం నచ్చజెప్పింది. ఎంత మాత్రమూ ఆస్పత్రిలో ప్రసవానికి రాలేనంటూ ఆమె మొండికేస్తూ వచ్చింది. శనివారం ఆ గ్రామాన్ని మీడియా బృందం సందర్శించగా, ఆ మహిళను ఎఎన్ఎం మంగ ఒప్పిస్తున్న దృశ్యం కనిపించింది. ఆమెకు తెలుగు భాష కొంచెం రావడంతో భర్త రాజు, ఎఎన్ఎంతోపాటు మీడియా ప్రతినిధులు కూడా వివరించారు. దీంతో ఆమె సోమవారం స్కానింగుకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లేందుకు అంగీకరించింది.

గర్భిణిని బతిమలాడుతున్న ఎఎన్ఎం మంగ

దోమల నివారణకు డ్రైడే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహనరావు కోరారు. శనివారం మండలంలోని అడ్డాపుశిల గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ డ్రైడే కార్యక్రమాల నిర్వహణ తీరును పలు వీధుల్లో పరిశీలించారు. కాలువల్లో చెత్త వేయరాదని, అందువల్ల నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తికి కారణమవుతుందని సూచించారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తద్వారా దోమల వ్యాప్తి తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలు నిర్వహించి, పరిసరాల శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది శ్రావణి, సంధ్య, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పెదబోగిలి సచివాలయాన్ని శనివారం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, డ్వామా పీడీ రామచంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 97 పంచాయతీల్లో లైబ్రరీలు ఏర్పాటు చేశామన్నారు. నిరుద్యోగులకు వివిధ రకాల పోటీ పరీక్షల కోసం 132 రకాల పుస్తకాలు అందించామని తెలిపారు. అభిలాష యాప్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనిద్వారా ఎవరు, ఏ పుస్తకాలు తీసుకెళుతున్నారో తెలుస్తుందన్నారు. జిల్లాలో అన్ని పంచాయతీలలోనూ ఈ లైబ్రరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ జి.వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభిలాష యాప్ గురించి వివరిస్తున్న పిఒ, పీడీ

'షర్మిలపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి-బొబ్బిలి

పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలపై ఎమ్మెల్యే శంబంగి విమర్శలు చేయడం తగదని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతో షర్మిలపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ పరువు తీస్తున్నది వైసిపి పార్టీ అని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు షర్మిలను వినియోగించుకున్న విషయాన్ని గుర్తుచేశారు.

100 రోజుల్లో ఆర్ఇసిఎస్ పునరుద్ధరణ

చీపురుపల్లి : టిడిపి అధికారంలోనికి వచ్చిన 100 రోజుల్లోనే తిరిగి ఆర్ఇసియస్‌ను పునరుద్ధరిస్తామని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు అన్నారు. స్థానిక నటరాజ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతున్న ఆర్ఇసియస్‌ను అధికార వైసిపి బోర్డులో విలీనం చేయడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే తోటపల్లి కాలువకు సంబంధించి పిల్ల కాలువలను చెరువులకు అనుసంధానం చేసే బాధ్యత తీసుకొని రైతులకు సకాలంలో నీరందిస్తానని తెలిపారు.

ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం నాయకులు

29, 30న గిరిజన విద్యారంగ పరిరక్షణకు ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన విద్యారంగ పరిరక్షణకు ఈ నెల 29, 30 తేదీల్లో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎల వద్ద యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళిమోహన్‌రావు, గిరిజన సంఘం నాయకులు కె.అవినాష్, లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ధర్నా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

అనంతరం వారు మాట్లాడుతూ జిఒ 3ని పునరుద్ధరించాలని, నాన్‌షెడ్యూల్డ్ ఏరియా గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో కలపాలని, సవర భాషా వాలంటీర్లను మార్చి, ఏప్రిల్ కొనసాగించాలని, సిఆర్‌టిసిలను రెగ్యులర్ చేయాలని, తదితర డిమాండ్లపై ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. 29న సీతంపేట, 30న పార్వతీపురం ఐటిడిఎల వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు.

29న కలెక్టరేట్ వద్ద పింఛనుదార్ల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఈ నెల 29న పార్వతీపురంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతిరావు కోరారు. శనివారం స్థానిక రైతుబజార్ సమీపంలో ఉన్న సంఘం భవనంలో గణపతిరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలపై మూడు దశలుగా ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే 25న తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామని తెలిపారు. 29న రెండో దశలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి, జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 5న మూడో దశలో విజయవాడలో ధర్నాచౌక్ వద్ద నిరసన చేపట్టి, ముఖ్యమంత్రికి వినతి పత్రం అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం కోశాధికారి రౌతు తవిటినాయుడు, పూర్వ కార్యదర్శి ఆబోతుల త్రినాథం, సభ్యులు వెలగల సన్యాసినాయుడు, మరిశర్ల లక్ష్మణరావు, ఎ.తవిటిరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో దొందూ దొందే

ప్రజాశకి - విజయనగరం ప్రతినిధి

ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందుగానే వ్యవహరిస్తున్నాయనే వాదన జనం నోట చర్చనీయాశమౌంతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉద్యోగాల కోసం ఎదురు చూసి మోసపోయిన నిరుద్యోగులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పాలకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలు కల్పిస్తామంటూ మోడీ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. తనకు ఒక్క అవకాశం కల్పిస్తే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగావున్న పోస్టులన్నీ భర్తీ చేస్తానని, ఇందుకోసం ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ విధితమే. దీంతో, జనం జగన్‌కు పూర్తి మెజార్టీ ఇచ్చారు. కానీ, జాబ్ క్యాలెండర్ కాదు సరికదా కనీసం ఖాళీ అవుతున్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు. డిఎస్‌సి విడుదల చేయలేదు. కొత్తగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదు. కేంద్రం అమలు చేస్తున్న నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాలల విలీనం పేరుతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వందలాది స్కూళ్లను ఎత్తివేశారు. దీంతో ఆమేరకు ఉపాధ్యాయ పోస్టులు గల్లంతయ్యాయి. మెగా డిఎస్‌సి వెంటనే ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగులు విజయనగరంలో ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి కోటజంక్షన్ వరకు భారీ ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. విద్య వ్యాపారమయంగా మారిన నేపథ్యంలో బిఇడి, టిటిసి వంటివి పూర్తిచేయడం, ఆ తరువాత డిఎస్సీ క్వాలిఫై కావడం అంటే మాటలు కాదు.

సమయంతోపాటు ఫీజుల రూపంలో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు లక్షల రూపాయలు వెచ్చించాల్సిన దుస్థితి ఉంది. వైసిపి అధికారంలోకి సచివాలయ ఉద్యోగాలు మినహా ఒక్క శాఖల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎక్కువ మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్న డిఎస్‌సి నోటిఫికేషన్ ఊసే లేదు. కేంద్ర విద్యా శాఖ మంత్రి మన రాష్ట్రంలో 50వేల పోస్టులు ఖాళీలున్నాయని పార్లమెంట్‌లో ప్రకటిస్తే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 714పోస్టులు మాత్రమే అంటూ ఒకరోజు, ఎనిమిది వేల పోస్టులు అని మరో రోజు.... రోజుకో రకంగా చేస్తున్న ప్రకటనలు ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఈ నేపథ్యంలోనే చదువుకున్న యువత ఉపాధి పనులు చేయడం, వలసకూలీలుగా మారడం వంటివి పెరిగాయి. కనీసం స్వయం ఉపాధి పొందదామంటే ప్రభుత్వం నుంచి అటువంటి సహకారం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్-1, గ్రూప్ -2 పోస్టులు కూడా గడిచిన ఐదేళ్లగా తీయకపోవడం వల్ల సాక్షాత్తు మండల, జిల్లా స్థాయి అధికార పోస్టులు కూడా అంతకన్నా తక్కువస్థాయి గల అధికారులతో నింపారు. మన రెండు జిల్లాల్లో సగానికి సగం మంది దిగువ స్థాయి అధికారులతోనే జిల్లా స్థాయి పనులు చేయిస్తుండడం సర్కారు తీరుకు నిలువెత్తు నిదర్శనమని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం బంగారు బాతులాంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (విశాఖ స్టీల్‌ప్లాంట్)ను విదేశీ ప్రైవేటు సంస్థలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండడంతో ఇందులోని ఉద్యోగాలకు భద్రత ఉండే పరిస్థితి లేదు. దీంతో కొత్తగా ఉద్యోగాలు వచ్చేందుకు కూడా అవకాశాలు తగ్గిపోతాయి. ఈనేపథ్యంలో నిరుద్యోగులు, యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ మోసం చేసిన ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.

స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు

ఐక్య పోరాటంతో అంగన్వాడీల విజయం

ప్రజాశక్తి-కొమరాడ

ఐక్య పోరాటంతోనే అంగన్వాడీలు విజయం సాధించారని సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర తెలిపారు. కొమరాడలో శనివారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిర, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు గౌరమ్మ, ఉపాధ్యక్షులు అనురాధ మాట్లాడారు. పోరాటానికి సహకరించిన కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు అలివేలు, జయమ్మ, మల్లేశ్వరమ్మ, పద్మ, జ్యోతి, ఎం.సావిత్రమ్మ, మీనాక్షి, శారద పాల్గొన్నారు.

టిడిపిని వీడని ఉత్కంఠ

● అభ్యర్థిపై కొనసాగుతున్న సందిగ్ధత ● మక్కువలో ప్రచారానికి శ్రీకారం చుట్టిన తేజోవతి

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు నియోజకవర్గంలో టిడిపి శ్రేణులను ఇంకా ఉత్కంఠ వీడడం లేదు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనే దానిపై సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి హోదాలో సంధ్యారాణి తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకుంటూ పోతున్నారు. తన అనుచరులతో కలిసి ఆమె ముందుకు పోతున్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు భంజ్‌దేవ్ లేకుండానే ఆమె కదనరంగంలోకి సిద్ధమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తనకు పోటీగా తేజోవతిని తెరపైకి తెచ్చారనే ఆగ్రహంతో ఆమె రగిలిపోతున్నారు. పార్టీలో కొంతమంది సీనియర్ నాయకులు తేజోవతికి మద్దతుగా నిలబడడం, సొంతంగా ఎన్నికల ఖర్చు భరించగలిగే అభ్యర్థి కోసం పార్టీ అధిష్టానం అన్వేషించడం వంటి పరిణామాలు సంధ్యారాణికి టికెట్ సాధించడంలో ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. స్థానికేతర నాయకురాలు అయినప్పటికీ తేజోవతికి పార్టీలో బలమైన గ్రూపు మద్దతుగా నిలబడడం, ఆర్థిక పరమైన అంశాలు ఆమెకి అనుకూలంగా పరిణమించే అవకాశం ఉంది.

సంధ్యారాణి

తేజోవతి

ఇప్పటికే నియోజకవర్గ పార్టీలో కొంత వ్యతిరేకత కలిగి ఉన్న సంధ్యారాణి అనుచరులు ఇటీవల శంబర పోలమాంబ జాతర సమయంలో తేజోవతి ఫ్లెక్సీలను చించివేయడం, ఈ విషయంపై అధిష్టానానికి ఫిర్యాదులు అందడంతో మరింత ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తేజోవతికి మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తోపాటు బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆశీస్సులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో తేజోవతి కొద్ది రోజుల క్రితం మక్కువ మండలంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మండలానికి చెందిన సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు అండతో ఆమె మండలంలో పర్యటించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో కొంత అయోమయం నెలకొంది. ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్నప్పటికీ పార్టీ అభ్యర్థి ఎవరనే దానిపై సస్పెన్స్ వీడడం లేదు.

ఇంటింటి కుళాయిలు పూర్తయ్యేదెప్పుడు?

ప్రజాశక్తి - సీతంపేట

ఇంటింటి కుళాయి పనులు ఎప్పుడు పూర్తిచేస్తారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు ప్రశ్నించారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. సీతంపేట మండల కేంద్రంలో నాలుగేళ్ల క్రితం రూ.7 కోట్లతో ప్రారంభించిన ఇంటింటి కుళాయి ప్రాజెక్టు పనులు నేటికీ ప్రారంభం కాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపించడం వల్ల హడావుడిగా పనులు ప్రారంభించడంతో కాంట్రాక్టర్ నాణ్యత లేని పనులు చేస్తున్నా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లు కొల్లగొడుతున్నారని చెప్పారు. ఐటిడిఎ పరిధిలో పాలకవర్గ సమావేశాలు సక్రమంగా జరగక, చేపడుతున్న పనులపై సరైన చర్చ లేని కారణంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జోక్యం చేసుకొని, నాణ్యమైన పనులు జరిగేలా, నీరు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపిడిఒ జావేద్, తదితరులు

'ఆడుదాం ఆంధ్ర' విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం ఎంపిడిఒ షేక్ మహమ్మద్ ఆకిబ్ జావేద్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మంతిని వాసుదేవరావు, గాంధీ, తిరుపతిరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎల్విన్‌పేటలో వాహన తనిఖీలు

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివప్రసాద్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఎల్విన్‌పేట - గుణుపూర్ రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద ఎల్విన్‌పేట పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా మధ్య రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించి విడిచి పెట్టారు. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్ఐ శివప్రసాద్ చెప్పారు. వాహనదారులు లైసెన్స్, అనుమతి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

ఓటును అమ్ముకోవద్దు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రజాస్వామ్యంలో అతి విలువైన, అమూల్యమైన తమ ఓటును అమ్ముకోవద్దని రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పైడా కొండలరావు విజ్ఞప్తి చేశారు. ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలని కోరారు. త్వరలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో పర్యటించి ఓటు హక్కు అవశ్యకతపై ప్రచారం చేస్తామని తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు గా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజా రక్షణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ప్రజా రక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు పట్టణ ఎస్ఐ రవీంద్ర రాజు తెలిపారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని తెలిపారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ప్రతీ వారం ఒకట్రెండు వీడియోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రరాజు

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని పార్వతీపురం టౌన్ స్టేషన్ ఎస్ఐ రవీంద్రరాజు తెలిపారు. శనివారం పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వాహనాలు నడుపుతున్న మైనర్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మోటార్ వాహనాల చట్టం ప్రకారం మైనర్లు వాహనాలు నడిపితే సంబంధిత వాహన యజమానిపై కేసులు పెట్టే అవకాశం ఉందన్నారు. ఎవరూ కూడా మైనర్లకు డ్రైవింగ్‌ను ప్రోత్సహించవద్దని కోరారు.

'రాజన్నదొర చేసింది శూన్యం'

ప్రజాశక్తి- మెంటాడ

గుర్ల మినీ రిజర్వాయర్‌ను ప్రారంభించి 70 శాతం పనులు పూర్తి చేసింది టిడిపి ప్రభుత్వమేనని నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, మంత్రిగా వున్న రాజన్న దొర ఏమి చేశారో చెప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించారు. నియోజకవర్గానికి రాజన్నదొర, వైసిపి ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. మండలంలోని గుర్ల గ్రామంలో శనివారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్నది టిడిపి ప్రభుత్వమేనని గుర్ల రిజర్వాయర్ పూర్తి చేసి రైతులకు కానుకగా ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి నుంచి టిడిపికి అనేక మంది క్యూ కడుతున్నారని, ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం వైసిపి నుంచి 50 కుటుంబాలు ఆమె సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు రెడ్డి ఆదినారాయణ, రెడ్డి పార్వతి, సరకాన రాము నాయుడు, చిన్నం నాయుడు, వెంకన్న, తాడ్డి తిరుపతి, తాడ్డి గోవింద్, డీలర్ సత్యం, డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన వైసిపి దురాలోచనకు నిదర్శనం

విజయనగరం టౌన్: కుల గణన చేపట్టడం వైసిపి దురాలోచనలకు నిదర్శనమని జనసేన నాయకులు గురాన అయ్యలు మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న బిసి కులాల గణన కేవలం ఎన్నికల ఎత్తుగడగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ఆర్థిక అంశాలతో కులగణనకు ముడిపెట్టకూడదన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన చేపట్టడమే ప్రభుత్వ ఉద్దేశం అయితే ఆదాయం, భూముల వివరాలు, ఆస్తుల వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా రాజ్యాంగ వ్యతిరేకంగా కుల గణన పేరిట సర్వే చేయడం సరైనది కాదన్నారు.

కురుపాంలో విజయమే లక్ష్యం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేశ్ చంద్రదేవ్

జయహో బిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీరేశ్, ప్రదీప్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. కురుపాంలో తన కోట వద్ద యువగళం పాదయాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళంలో 226 రోజులు 3132 కిలోమీటర్లు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారని తెలిపారు. అవన్నీ టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం మీద ప్రజా వ్యతిరేక తీవ్రంగా ఉందని, బిసిల పార్టీ టిడిపికి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిల 16 రకాల పథకాలను ఎత్తేసిందన్నారు. బాబు వస్తేనే యువతకు జాబు లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గడపకూ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించి, అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని ప్రకటిస్తే వారి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ప్రకటించారు. అనంతరం జయహో బిసి కార్యక్రమం పోస్టర్‌ను మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్ చంద్ర దేవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి ఒకటో తేది నుంచి కురుపాం మండలంలో జరిగే జయహో బిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌చంద్ర, నాయకులు

టిడిపికి బిసిలే వెన్నెముక

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బిసిలే వెన్నెముకగా నిలిచిన చరిత్ర ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జయహో బిసి సదస్సులో వక్తలు మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బిసిలను తుంగలో తొక్కిందన్నారు. తమ హయాంలో అమలు చేసిన పథకాలన్నీ నిలిపివేసి, బిసి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, వారిని మోసం చేశారని అన్నారు. బిసిలను విడగొట్టి కులాలుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి విధులు, నిధులు లేకుండా చేశారని తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్లను దిష్టిబొమ్మలుగా మార్చిన చరిత్ర వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టిడిపి అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్‌నాయుడు, ఐటిడిపి కోఆర్డినేటర్ బార్నాల సీతారాం పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రవి, మండల అధ్యక్షులు బోను దేవి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి గౌరజాన చంద్రమౌళి, నాయకులు పోలా సత్యనారాయణ, ఐటిడిపి అధ్యక్షులు కోరాడ నారాయణ రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవి కుమార్, డాక్టర్ గరిమెళ్ళ భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ కృష్ణాజీకి ప్రశంసలు

ఎస్ఐ కృష్ణాజీకి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజీ జిల్లా ఉత్తమ అధికారిగా ప్రశంసలు పొందారు. ఈ మేరకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని ఆయన అందుకున్నారు. దీంతోపాటు గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలలో అందించిన సేవలకు ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ చేతుల మీదగా కూడా ఉత్తమ అవార్డు అందుకున్నారు. దీనికిగాను పంచాయతీరాజ్ డిఇలు, ఎఇలు ఆయనకు అభినందనలు తెలిపారు.

అరుదైన 'గౌర'వం

రిపబ్లిక్ డే పరేడ్‌లో ముగడ యువతి

ప్రజాశక్తి-బాడంగి

దేశ గణతంత్ర వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాహస విన్యాసాలు, కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కొందరికే లభిస్తుంది. అలాంటి అవకాశం ఒకసారి రావడమే గగనం. అలాంటిది రెండుసార్లు రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కడం చాలా అరుదు. కానీ, అలాంటి అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది ముగడ గ్రామానికి చెందిన తెంటు గౌరీశ్వరి. కేరళలో సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ (సిటి)గా విధులు నిర్వహిస్తున్న గౌరీశ్వరి.. న్యూఢిల్లీలో జరిగిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సిఆర్‌పిఎఫ్ మహిళల బృందం నిర్వహించిన మార్చ్‌లో భాగస్వామ్యమైంది. గతేడాది రిపబ్లిక్‌డే వేడుకల్లో మార్చ్ నిర్వహించిన సిఆర్‌పిఎఫ్ బృందంలోనూ ఆమె ఉన్నారు. వరుసగా రెండో ఏడాది మార్చ్‌లో పాల్గొన్నారు. సాధారణంగా మహిళలు భద్రతా బలగాల్లో చేరడం అరుదు. ముగడ గ్రామం నుంచి త్రివిధ దళాల్లో అనేక మంది పురుషులు పనిచేస్తున్నారు. కానీ యువతి గౌరీశ్వరి ఒక్కరే భద్రతా బలగాల్లో (సిఆర్‌పిఎఫ్)లో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. తమ గ్రామానికి చెందిన యువతి గౌరీశ్వరి రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనడం పట్ల గ్రామస్తులతోపాటు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

వృద్ధుల బాధ్యత కుటుంబ సభ్యులదే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వృద్ధులను గౌరవించుకోవలసిన బాధ్యత కుటుంబ సభ్యులదేనని అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య అన్నారు. శనివారం మండలంలోని నర్సిపురం పంచాయతీ కార్యాలయంలో ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, వయోవృద్ధుల సంక్షేమంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, ప్రస్తుతం చాలా కారణాల వల్ల ఆ అవి కనుమరుగయ్యాయని చెప్పారు. భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగ బాధ్యతల వల్ల పెద్దల పట్ల నిర్లక్ష్యం చూపిస్తున్నారనే అపవాదు వచ్చిందన్నారు. కనీసం పెద్దలను రోజుకు ఒకసారి అయినా పిల్లలు పలకరించాలని తెలిపారు. ఒకవేళ పెద్దలను పట్టించుకోకపోతే పిల్లలపై ట్రిబ్యునల్లో మెయింటెనెన్స్ కేసు వేయవచ్చని సూచించారు. సదస్సులో సీనియర్ న్యాయవాదులు జోగారావు, వెంకట్రావు, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి సౌజన్య

3న ఢిల్లీలో ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎఐఎఫ్ఆర్‌టిఇ ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యా విధానం-2020 ను రద్దు చేయాలని ఫిబ్రవరి 3న ఢిల్లీలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నూతన నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్(ఎన్‌సిఎఫ్)ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పారావాలంటీర్, ఎంటిఎస్ టీచర్లు, పార్ట్ టైం టీచర్ల వ్యవస్థను రద్దుచేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఎస్‌కె పాడులో పర్యాటక ప్రాంత ప్రధాన ద్వారం

పర్యాటకుల విశ్రాంతి భవనం

సుందర వనం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యాటక ప్రాంతం ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఎస్‌కెపాడు నర్సరీ ఆవరణలో చేపడుతున్న పర్యాటక ప్రాంత అభివృద్ధి పనులు ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు వచ్చి కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపేందుకు పర్యాటక కేంద్రంలో అన్ని రకాలైన వసతులు ఏర్పాటు చేశారు. బోటు షికారు, చిన్నపిల్లల పార్కు, పర్యాటకుల విశ్రాంతి భవనాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

అల్లూరి విగ్రహం చుట్టూ పచ్చదనం

ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

4న సాగర సంగ్రామ దీక్ష

ప్రజాశక్తి-పాలకొండ

పాత పెన్షన్ పునరుద్ధరణ కోరుతూ ఫిబ్రవరి నాలుగో తేదీన విశాఖపట్నంలో జరిగే సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని ఎపి సిపిఎస్ఇఎ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ కోరారు. దీక్ష సన్నాహక సమావేశాన్ని శనివారం స్థానిక సత్యసాయి పాఠశాల ప్రాంగణంలో కె.చినప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు అయ్యేంత వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టంచేశారు. ఏ ప్రభుత్వం మారినా లక్ష్యం మారకూడదని తెలిపారు. అనంతరం మండల నూనత కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాగర సంగ్రామ దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎపి సిపిఎస్ఇఎ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పైడిపు నాయుడు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రొంగలి అప్పలరాజు, ఎం.త్రినాథస్వామి, సింహాద్రి అప్పడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కొరికాన శంకర్రావు, బి.సంతోష్, రవి పాల్గొన్నారు.

వీరఘట్టంలో ట్రాఫిక్ జామ్

నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద శనివారం పోలీసులు లారీలు నిలిపివేయడంతో ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో పూర్తిగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

శ్రీ జిల్లా కలెక్టర్ వారి టెండర్ ప్రకటన
శ్రీ జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, పార్వతీపురం మన్యం జిల్లా

పార్వతీపురం మన్యం జిల్లా, కార్యాలయానికి ఈ క్రింది సూచించిన కంప్యూటర్లు మరియూ ఇతర ఎలక్ట్రానిక్స్ పరికారాలు కొనుగోలు చేయు నిమిత్తం "స్వల్ప కాలిక" "సీల్డ్ టెండర్లు" ఆహ్వానించడమైనది. టెండర్లు ప్రకటన మరియు తదుపరి వివరములకు గాను సంప్రదించవలసిన ఫోన్ నెం. 9493808860.

టెండర్లు స్వీకరించు స్థలం: పరిపాలనాధికారి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, పార్వతీపురం మన్యంలో తే.02.02.2024. మధ్యాహ్నం గం.04.00.ల వరకు (కార్యాలయపు పనివేళలలో)

టెండర్లు తెరుచుస్థలం: శ్రీ సంయుక్త కలెక్టర్, పార్వతీపురం మన్యం వారి చాంబరు నందు తే.02.02.2024.ది, సమయం: సాయంత్రం గం.05.00.లకు.

సం/- ఆర్. గోవింద రావు, ఐ.ఎ.ఎస్.,
సంయుక్త కలెక్టర్
పార్వతీపురం మన్యం జిల్లా.